ఆమెను
అపార్థం
చేసుకున్న అతను
కోల్పోయిన దేవిటి?

# అడవికాచిన వెన్నెల

జి.ఎన్. భూషణ్ రావు
కథ

ఈ లోకంలో నాకెవరైనా అర్థం కాలేదూ అంటే ఆ వ్యక్తి హరిణి. సైకాలజీలో మాస్టర్ డిగ్రీ తీసుకున్న నేను కూడా ఆమె మనస్తత్వాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేకపోయాము.

ఆమెను మొదటిసారి చూసినపుడు ఒ మలయమారుతం అనుకున్నాను. కానీ తర్వాత తెలిసింది ఆమె ఓ సుడిగాలని.

"మీట్ మిస్ హరిణి. నా ఫ్రెండ్" అని నా క్లాస్‌మేట్ సహజ మొదటిసారి యూనివర్శిటీలో పరిచయం చేసినపుడు 'నమస్తే' అంది రెండు చేతులూ జోడించి నవ్వుతూ. ఆ ముగ్ధను చూసి నిజంగానే ముగ్ధున్నయ్యేను. ఆ తర్వాత ఆమె చాలాసార్లు ఎదురుపడ్డా స్వతహాగా మితభాషిని, మొహమాటస్తున్ని కావటం మూలాన ఎప్పుడూ ఆమెను పలకరించే ప్రయత్నం చేయలేదు.

ఓ రోజుకి క్లాసుకి టైం అవుతోందని వడివడిగా నడుస్తున్న నేను 'హలో' అన్న పిలుపు వినిపించి వెనక్కు తిరిగేను.


"హరిణి."

"ఏమిటీ చాలా హడావిడిగా వెళుతున్నారు?" అని అడిగింది చేతిలో ఉన్న మాగజైన్ని ఫోల్డ్ చేస్తూ.

"క్లాసుకి టైం అయింది. అందుకే" అన్నాను నవ్వి.

"ఎప్పుడూ ఉండే క్లాసులే లెండి. రండి అలా కాంటీన్లోకెళ్ళి టీ తాగొద్దాం." అంటూ నా సమాధానం కోసం ఎదురు చూడకుండా ముందుకు నడిచింది.

అప్రయత్నంగానే ఆమెను అనుసరించేను.



"అవునూ మీరు ఎం.బి.ఏ చేశారు కదా? మళ్ళీ ఈ సైకాలజీలోకి ఎందుకొచ్చినట్టు!" అంది నడుస్తూనే.

"సైకాలజీ ఇంట్రస్టింగ్ సబ్జక్టు కదా! అందుకే" అన్నాను నవ్వుతూ.

"ఏం ఇంట్రస్టో. మీరు కూడా నాలాగే ఇంగ్లీష్ లిటరేచర్‌లో జాయినయితే బావుండేది" అది బాధపడుతున్నట్టు.

"ఎందుకు?" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఏం లేదు. నాకు నోట్సు అదీ ప్రిపేర్ చేసుకునే శ్రమ తప్పేది" అంది ఫక్కున నవ్వేస్తూ.

నేను కూడా నవ్వేను. "మీ క్లాసులో అంతమంది అబ్బాయిలున్నారు. వాళ్ళలో ఎవర్నయినా అడగక పోయూరా?" అన్నాను నవ్వుతూనే.

"వాళ్ళనా? సరేలెండి. స్త్రీకాయి వెధవలు. ఆడది కనిపిస్తే చొంగకార్చుకుంటూ చూడటమే తప్ప ఎలా బిహేవ్ చేయాలో కూడా తెలీదు వెధవలకి," అంది తేలిగ్గా తీసి పారేస్తూ.

"మరి నేను అలాంటి వాణ్ని కానని ఎలా అనుకుంటున్నారు?" అన్నాను ఆమెనే పరీక్షగా చూస్తూ.

"సింపుల్. నేను పరిచయం కాగానే వాంటెడ్లీ నాతో మూవ్ అవ్వాలని ప్రయత్నిస్తారు అందరూ. సహజ మిమ్మల్ని పరిచయం చేసి రెండు నెలలవుతోంది. మీరు ఇంత వరకూ మళ్ళీ నన్ను పలకరించలేదు. కనీసం నన్నో చూసినప్పుడు చిన్న చిరునవ్వు నవ్విన పాపాన కూడా పోలేదు. ఇది చాలదా మీరు గుడ్‌బాయ్ అని చెప్పడానికి." అంది నవ్వేస్తూ.

ఆమె విశ్లేషణకు నవ్వొచ్చింది నాకు.

ఆ తరువాత మా సాన్నిహిత్యం పెరిగింది. మా ఇద్దరి అభిరుచులూ దాదాపు కలవటం మూలానే మా స్నేహం చాలా త్వరగా అభివృద్ధి చెందింది. కిషోర్‌కుమార్ సోలోస్ దగ్గర్నుంచి కీట్స్ పోయెట్రీ వరకూ మాకు అన్నీ చర్చనీయాంశాలే. అందరిలాగే నేను కూడా హారిణి అందానికి, చలాకీతనానికి దాసోహమన్నారు. ఒకానొక సమయంలో ఆమెను పెళ్ళి చేసుకోవాలని కూడా అనుకున్నాను. ఆమె కూడా నేనంటే ఇష్టమున్నట్టే ప్రవర్తించేది. కానీ పెళిళ, విషయం ఆమెతో నేను ఎప్పుడూ చెప్పలేదు. బహుశా నాలోని 'మేల్ సుపీరియారిటీ' ఇందుకు కారణం కావచ్చు. మారేజ్ ప్రపోజల్ ముందు ఆమె వైపు నుండే రావాలని ఎదురు చూసాను.

కానీ "ఈ ట్వంటీసిక్త్‌కి నా పెళ్ళి. నువ్వు తప్పకుండా రావాలి మహంత్." అంటూ వెడ్డింగ్ ఇస్తున్న ఆమెను చూసి చిత్తరువునయ్యేను.

ఆమె మరొకరి సొంతం కావటం చూడటానికి మనస్సు అంగీకరించకపోయి నా ఆమె అందాన్ని సొంతం చేసుకుంటున్న అదృష్టవంతుణ్ని చూడాలనే క్యూరియాస్‌లో పెళ్ళికి హాజరయ్యేరు.

అతను నిజంగానే అందగాడు. నాకన్నా కూడా. పైగా మంచి ఉద్యోగం. మొదట జెలసీ ఫీలయినా తర్వాత 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' లా ఉన్న ఆ జంటను మనస్ఫూర్తిగా ఆశీర్వదించేను.

తర్వాత కొన్నాళ్ళకి రాజకీయంగా, ఆర్థికంగా మంచి పలుకుబడి ఉన్న వ్యక్తి కూతురితో నా పెళ్ళి జరిగింది.

నా భార్య మానస అనాకారేం కాదు. కానీ హారిణితో పోల్చదగ్గ అందం కాదు మానసది.

మృత్తికలో మొలకెత్తిన శాద్వలాంకురం

నా భార్య అయితే గాజు తొట్టిలో అపురూపంగా పెంచుకునే లతానికుంజం హరిణి అయినా నా భార్యకు ఏ లోటూ చేయలేదు. మా సంసారం హాయిగా సాఫీగా సాగిపోతోంది. మామగారి అండలో పెద్ద హోదా ఉన్న ఉద్యోగంతో పాటు సంఘంలో వి.ఐ.పిగా నా స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాను.

ఆ రోజు పార్టీలో కాకతాళీయంగా నా క్లాస్‌మేట్ అశోక్ కనిపించకపోతే మళ్ళీ హరిణి గురించి తెలుసుకునే అవసరం కలిగేది కాదు.

"నీకు హరిణి గుర్తుందా? బ్లడీబిచ్. నేను ప్రేమిస్తున్నానని చెబితే ఓసారి అద్దంలో మొహం చూసుకోమని ఎద్దేవా చేసింది. ఇప్పుడు దాని మొహమే ఎందుకూ పనికి రాకుండా పోయింది. స్టౌ అంటుకోకొని మొహం కాలిపోయి మొగుడు వదిలేస్తే పుట్టింట్లో ఉంటోంది" తన కసినంతా మాటల్లో వ్యక్తపరుస్తూ చెప్పేడు అశోక్.


నేను నిరుత్తరున్నయ్యేను. హరిణి నాకేమీ కాకపోయినా సంతోషంగా ఉందనుకున్న ఆమె భర్త నిరాదరణలో అనాకారిగా పుట్టింటికి చేరుకుందన్న విషయం నేను భరించలేకపోతున్నాను. ఆమె అందం, చలాకీతనం గుర్తొచ్చి అనుక్షణం బాధపెడుతున్నాయి. హరిణిని చూడాలన్న కోరిక నాలో రోజు రోజుకీ పెరిగిపోయింది.

ఇక ఉండలేక ఓ రోజు హైదరాబాద్ బయల్దేరాను. హోటల్ గదిలో రిఫ్రెష్ అయిన తర్వాత ఆ సాయంత్రం హరిణి ఇంటికి వెళ్ళేను. నేను వెళ్ళేసరికి కూర్చుని ఓ అమ్మాయి ఒంటరిగా చెస్ ఆడుకుంటోంది. పోలికలను బట్టి హరిణి చెల్లెలుగా గుర్తించేను.

"ఎవరు కావాలండీ?" అంది నన్నే పరిశీలనగా చూస్తూ.

"హరిణిని చూడాలి. నా పేరు మహంత్. వైజాగ్ నుంచి వచ్చేను." అన్నాను.

"పిలుస్తాను. కూర్చోండి" అని చెప్పి



లోపలికి వెళ్ళింది.

అయిదు నిమిషాల తర్వాత బయటకొచ్చి న హరిణిని చూసి అదిరిపడ్డాను. పోల్చుకోవ డానికి వీలులేనంతగా మారిపోయింది. అం దాన్నంతా తనలో నిబిడీకృతం చేసుకుని ఎంతో మంది మతులు పోగొట్టిన ఆమె మొహం కాలిన పెద్దమచ్చతో వికృతంగా ఉంది. మెడమీద చేతుల మీద కూడా కాలిన మచ్చలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

"హాయ్ మహంత్. వాటే సర్‌ప్రయిజ్?" అంది నా ఎదురుగా కూర్చుంటూ.

"అయాం సారీ హరిణీ" అన్నాను గొంతు పెగుల్చుకుని.

"బట్ అయాం నాట్. అండ్ ఫీలింగ్ సో హాపీ. నాకిలా జరిగినందుకు నేను ఎప్పుడూ బాధపడలేదు మహంత్. నాకు సానుభూతి చూపించడానికే వచ్చినట్టయితే నీరాక నాకు ఆనందాన్నివ్వదు. ఒకప్పటి ఫ్రెండ్‌గా ఆ స్వీట్ మెమోరీస్‌ని గుర్తు చేయటానికి వచ్చావని నేను అనుకుంటున్నాను. నాకు కావలసినది కూడా అదే" అంది స్థిరంగా.

"అసలెలా జరిగింది?" అన్నాడు బాధగా.

"ఏం లేదు. వంట చేస్తుంటే చీరకొంగు అంటుకుంది. ఇక ఆ టాపిక్ వదిలేస్తావా?" అంది చిరుకోపంతో.

నవ్వేను నేను.

"ఏమిటి విశేషాలు? నీ పెళ్ళికి పిలవలేదేం?" అంది నిష్ఠూరంగాఫ

"సడన్‌గా ఫిక్సయ్యింది. అందుకే పిలవలేకపోయాను. సారీ" అన్నాడు సంజాయిషీ ఇచ్చుకుంటూ.

"ఇట్సాల్‌రైట్ అన్నట్టు మీ ఆవిడ అందంగా ఉంటుందా?" అంది కళ్ళెగరేస్తూ

"బాగానే ఉంటుంది. కానీ నీ అంత అందంగా మాత్రం ఉండదు." అన్నాను.

ఫక్కున నవ్వింది హరిణి. "ఇప్పుడు నేను అందంగా ఉన్నాని చెబుతున్నావంటే నీకు బ్రహ్మాండమయిన సైటయినా వచ్చుండాలి, లేదా మతయినా పోయుండాలి" అంది ఇంకా నవ్వుతూనే.

నవ్వలేదు నేను.

"హరిణీ. ఎన్నాళ్ళిలా ఉంటావు? మీ ఆయన దగ్గరకు వెళ్ళవా?" సూటిగా అడిగేను.

"అందమైన పెళ్ళామయితేనే కావాలట ఆయనకి. పుట్టింట్లోనే శాశ్వతంగా ఉండిపొమ్మని పంపించేడు. లాస్టమంతే డైవోర్స్ కూడా తీసుకున్నాం." ఎంతో మామూలుగా చెబుతున్నా ఆమెను చూస్తూ విస్తుపోయేను.

ఆ తర్వాత చాలాసేపు యూనివర్శిటీ రోజులు గుర్తు తెచ్చుకుని ఆ జ్ఞాపకాల్ని నెమరువేసుకున్నాం.

హోటల్ గదికి తిరిగి వచ్చానేకానీ నా మనసు మాత్రం హరిణి గురించే ఆలోచిస్తుంది. ఆమె వికృతమైన మొహాన్ని ఊహించుకోవడానికి కూడా నాకు మనస్కరించటం లేదు. హరిణి మామూలు మనిషి కావాలి. ఆమె అందం ఆమెను తిరిగి రావాలి. అప్పుడే ఆమె జీవితం బాగుపడుతుంది. చదువు, అందం ఉన్న హరిణిని, ఎవరైనా

స్వీకరిస్తారు. ఇందుకు ఒకటే మార్గం 'ప్లాస్టిక్ సర్జరీ.'

ఆ మరుసటి రోజు మళ్ళీ హరిణిని కలుసుకొన్నప్పుడు ఈ విషయం ప్రస్తావించేను. ఆమె నవ్వింది. ''ఇవన్నీ చేయించుకుని బాగుపడితే మాత్రం నాకు ఒరిగేదేమిటి చెప్పు '' అంది నిర్లిప్తంగా.

''అలా అనకు హరిణీ. నువ్వు మామూలు జీవితం ప్రారంభించాలంటే ఇదొక్కటే మార్గం. ''ప్లీజ్ కాదనకు'' అంటూ ప్రబతిమాలేను. ఓ పట్టాన ఒప్పుకోలేదు కానీ ఎంతో ప్రబతిమాలిన తర్వాత ఆమెను ఒప్పించగలిగాను.

బాంబేలోని ఓ ప్రముఖ ఆసుపత్రిలో హరిణి ట్రీట్‌మెంట్‌కి ఏర్పాటు చేసాను. ఇవన్నీ చేస్తున్నా ఓ ప్రశ్న నన్ను వెంటాడుతూనే ఉంది. ఏమీ కానీ హరిణి కోసం తాపత్రయపడుతున్నాడు? తను ఇంకా హరిణిని ప్రేమిస్తున్నాడా? లేదు. నా భార్యకు అన్యాయం చేసేంత కుసంస్కారి కాదు తను. మరి ఎందుకీ వెంపర్లాట? ఎంత ఆలోచించినా నాకీ ప్రశ్నకు సమాధానం దొరకలేదు.

మరుసటి నెలలోనే హరిణిని బాంబే తీసుకెళ్ళి సర్జరీ చేయించేడు. మళ్ళీ మామూలు స్థితికొచ్చిన హరిణిని చూస్తే ఏదో సాధించిన సంతృప్తి కలిగింది నాకు. ఆమెను హైదరాబాద్‌లో దించేసి త్వరలో మళ్ళీ కలుస్తానని చెప్పి వైజాగ్ తిరిగొచ్చేను.

నెలరోజుల నుంచీ పెండింగ్‌లో పడ్డ పనులతో క్షణం కూడా తీరిక లేకుండా అయిపోయేను. దాదాపు ఇరవై రోజుల తర్వాత హరిణి దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. ఆత్రంగా చించేను.

డియర్ మహంత్!

ఉత్తరం చూసి ఆశ్చర్యపోతున్నావు కదూ? నీకు ఈ ఉత్తరం అందేసరికి కొన్ని వేల మైళ్ళ దూరంలో ఉంటాను నేను. నా కోసం ఇంతగా తాపత్రయ పడ్డ నీకు నిజాల్ని చెప్పకుండా వెళ్ళిపోవడం కృతఘ్నత

## కంప్లయింట్



''మీ డిపోలో ప్రయాణీకుల నుండి వచ్చిన కంప్లయింట్స్ ఉన్నాయా'' అడిగారు పై అధికార్లు.

''లేవుసార్''

''గుడ్....ఎంత కాలం నుంచీ''

''కంప్లయింట్ బుక్ పోయినప్పటి నుంచీ సార్!'' వెంటనే చెప్పాడు మేనేజర్.

-కె. వెంకటరెడ్డి (కొమరిపాలెం)

అవుతుంది. అందుకే నీ నుంచి శాశ్వతంగా దూరమయ్యేముందు నా జీవితాన్ని ఈ ఉత్తరంలో ఉంచి నీకు పంపిస్తున్నాను.

జీవితాన్ని ముందు నుంచీ తెలిగ్గా తీసుకోవడం అలవాటయింది మహంత్. ఇందుకు నా 'అహం' కారణం కావచ్చు. నా అందం కోసం వెంపర్లాడే వాళ్ళను చూస్తుంటే నిజంగా నవ్వొచ్చేది. ఒకింత గర్వంగా కూడా ఉండేది. కానీ నాకు పరిచయమైన వాళ్ళలో నీదే డిఫరెంట్ కారెక్టర్. అవును నీ అంతగా నువ్వు ఎప్పుడూ నా కోసం ప్రయత్నించలేదు. నాకు నేనుగా నీ వెంటపడ్డా ఎప్పుడూ నీ హద్దుల్ని అతిక్రమించలేదు. బహుశా ఇందుకేనేమో నువ్వంటే ఇంట్రస్టు కలిగింది. అందర్నీ తేలిగ్గా తీసుకునే నేను నిన్ను మాత్రం మనస్ఫూర్తిగా ఇష్టపడ్డాను. నీతో జీవితం పంచుకోవాలని ఆశపడ్డాను. నువ్వు కూడా నేనంటే ఇష్టమున్నట్టు ప్రవర్తించేవాడివి. కానీ ఎప్పుడూ "నువ్వంటే నా కిష్టం" అని చెప్పలేదు. నువ్వు ఈ మాట అంటావేమోనని చాలా కాలం ఎదురు చూశాను. నేనే చెప్దామనుకున్నాను కానీ మళ్ళీ నా అహం అడ్డొచ్చింది. ఒకవేళ నా ప్రపోజల్ నీకు ఇష్టం లేకపోతే నీకు చులకనైపోనూ? అందుకే నీ నోటి వెంటే వినాలని ఎదురు చూశాను.

ఈ సందర్భంలోనే నాన్నా ఓ సంబంధం చూసేరు. అబ్బాయి అందగాడు. మంచి హోదా. అభ్యంతరం చెప్పేందుకు ఏమీ కనిపించలేదు. అందుకే ఒప్పుకున్నాను. చివరికి వెడ్డింగ్ ఇచ్చే రోజయినా 'నువ్వంటే నాకిష్టం హారిణీ' అని చెప్తావేమోనని చూసిన నాకు నిరాశే మిగిలింది. నువ్వడిగితే అప్పుడయినా అందర్నీ ఎదిరించి నీతో పెళ్ళికి సిద్ధపడేదాన్ని.

నా పెళ్ళిజరిగిపోయింది. నన్ను పెళ్ళి చేసుకున్న వ్యక్తికి అందం, హోదా ఉన్న స్థాయిలో గుణం లేదు. ఆయనకు చాలా మంది ఆడవాళ్ళతో సంబంధాలున్నాయి. అంతేకాదు ఆయన స్టెనోతో ఓ సంవత్సరం నుంచీ కాపురం వెలగబెతుడున్నాడు. మా నాన్న ఇచ్చే కట్నానికి ఆశపడీ, నా అందాన్ని చూసీ నన్ను పెళ్ళి చేసుకున్నాడు. ఈ విషయాలన్నీ తెలిసాక ఆయన్ని చెడామడా కూడా తిట్టి పుట్టింటికి వచ్చేసాను. కానీ పెళ్ళి అయిన కూతురు ఇంట్లోనే ఉంటే తన ప్రిస్టేజీకి భంగమని, నా చెల్లి పెళ్ళి చేయటం నా కిష్టమనీ చెప్పి బలవంతంగా నన్ను ఆయన దగ్గరకు పంపించేశాడు నాన్న.

ఇప్పుడు నేను అతనికి మరీ చులకనైపోయాను. నా ఎదుటే విచ్చలవిడిగా ప్రవర్తించడం మొదలు పెట్టాడు. అతన్ని చూస్తేనే నాకు కంపరంగా ఉండేది. ఆయన ముట్టుకుంటే గొంగళిపురుగు పాకుతున్నట్టు ఫీలయ్యేదాన్ని. కానీ ఏం చేయను? ప్రతి రాత్రీ అతని పశుబలం ముందు నా ఆడతనం ఓడిపోయేది.

అతని నుండి నన్ను కాపాడుకోటానికి ఒకటే మార్గం కనిపించింది. ఓ రోజు ఒంటిమీద కిరోసిన్ చల్లుకుని అంటించుకున్నాను. కాలి వికృతంగా తయారయిన నన్ను ఆయన మళ్ళీ ముట్టుకోలేదు. సంతోషంగా నాన్న దగ్గరికి వచ్చేసాను. డైవోర్స్ నోటీస్

పంపినపుడు రిలీఫ్ ఫీలయ్యాను.

ప్లాస్టిక్ సర్జరీ చేయించి మళ్ళీ పెళ్ళి చేస్తానని నాన్న చెబితే ససేమిరా ఒప్పుకోలేదు. కానీ మళ్ళీ తన ప్రిస్టేజీ. చెల్లి పేరు చెప్పి రోజూ నన్ను విసిగించడం మాత్రం మానలేదాయన. ఇక వీళ్ళ నుండి దూరంగా వెళ్ళిపోవడం ఒక్కటే ఉత్తమంగా తోచింది నాకు.

మా ప్రొఫెసర్ శివరామకృష్ణగారిని కలిసి విషయం మొత్తం చెప్పాను. కాలేజీ రోజుల్నుంచి నేనంటే ఆయనకు ప్రత్యేక అభిమానం. నా బాధను అర్థం చేసుకున్న ఆయన ఫారిన్‌లో పి.హెచ్.డీకి ఏర్పాటు చేస్తానని మాటిచ్చారు. ఆయనకున్న పలుకుబడి వల్ల నాకు కెనడాలో రీసెర్చి చేయడానికి అవకాశం దొరికింది. రీసెర్చ్ కంప్లీట్ చేసి అక్కడే సెటిల్ కావాలని నిశ్చయించుకున్నాడు. మరో రెండునెలల్లో నేను కెనడా వెళ్ళిపోవాలి. సరిగ్గా అప్పుడే నువ్వు కలిశావు. నాకోసం అంతదూరం నుంచి వచ్చేవని తెలిసినపుడు అనుకున్నాను మహంత్ నేనంటే నీకు ఇష్టమని. ఎవ్వరికీ అనందాన్నివ్వని నేను నీ కోరిక తీర్చటానికి సిద్ధపడ్డాను. నీకు శాశ్వతంగా దూరమయ్యే ముందు పూర్వం హారిణిలా నీకు కనిపించాలనే ట్రీట్‌మెంట్‌కి ఒప్పుకున్నాను. కానీ మళ్ళీ నీ స్నేహం నాకు జీవితం పట్ల ఆశల్ని కలిగించింది. ఇక్కడే ఉండిపోదామా అనిపించింది. నేను ఇక్కడే ఉంటే మన మధ్య మళ్ళీ సాన్నిహిత్యం పెరుగుతుంది. అది మీ సంసారంలో కలతలు రేపుతుంది. నా మూలంగా మీ సంసారం పాడవటం నా కిష్టంలేదు. అందుకే దూరంగా వెళ్ళిపోవాలని నిశ్చయించుకున్నాను. నేను ఎంత దూరం వెళితేనేం నువ్వు ఎప్పుడూ నాలోనే ఉంటావు. అద్దంలో చూసుకున్నపుడు కనిపించేది నేను కాదు. నువ్వే. నువ్వే కదా ఈ మొహానికి పూర్వ వైభవాన్ని తెచ్చింది. నా కోసం తాపత్రయపడే మనిషి ఒకరున్నారనే సంతృప్తితోనే నీకు దూరంగా వెళ్ళిపోతున్నాను మహంత్. నా ఈ ఉత్తరం నీకు మొదటిదీ, ఆఖరిదీనూ.

నా ఈ నిరాసక్త జీవితంలో ఇంకా ఒక కోరిక మిగిలి ఉంది. అదేంటో చెప్పనా? నా జీవిత చరమాంకం నీ సన్నిధిలో గడపాలని అది ఫలిస్తుందా మహంత్?

మృత్యువు సమీపిస్తుంది తెలుసుకున్న మరోక్షణం నీ దగ్గిర వాలిపోతాను. కనీసం అప్పుడైనా నీ వాకిలి తెరిచి నాకు స్వాగతం పలుకు. అంత వరకూ నీతో గడపబోయే మధుర క్షణాలను ఊహించుకుంటూ బ్రతుకుతాను.

నీ హారిణి.

ఉత్తరం పూర్తి చేసిన నా కళ్ళు నీళ్ళతో నిండిపోయేయి. నేను అనుకున్నట్టు హారిణి సుడిగాలి కాదు. మలయమారుతం. ఈ విషయం నాకు అర్థమయ్యేసరికి ఆమె నాకు అందనంత దూరానికి వెళ్ళిపోయింది. ఏం చేయగలను నేను? ఆమె రాకకై నిరీక్షించడం తప్ప.